15-10-2022 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - ఉదయముదయమే లేచి స్మృతిలో కూర్చునే అలవాటు చేసుకోండి, భోజనం చేసేటప్పుడు కూడా ఒకరికొకరు తండ్రి స్మృతినిప్పించుకోండి, స్మృతి చేస్తూ-చేస్తూ మీరు పాస్ విత్ హానర్ గా అవుతారు"

ప్రశ్న:- ఏ ఒక్క లోపము కారణముగా పిల్లల రిపోర్టు తండ్రి వద్దకు వస్తుంది?

జవాబు:- చాలామంది పిల్లలు ఇప్పటికీ ఇంకా ప్రేమ స్వరూపులుగా అవ్వలేదు. నోటితో దుఃఖాన్నిచ్చే మాటలను మాట్లాడుతూ ఉంటారు, అందుకే తండ్రి వద్దకు రిపోర్టు వస్తుంది. పిల్లలు చాలా ప్రేమగా నడుచుకోవాలి. ఒకవేళ స్వయంలోనే ఏదైనా అవగుణం రూపీ భూతము ఉన్నట్లయితే ఇక ఇతరులవి ఎలా తొలగిస్తారు, అందుకే దేవతల వలె ప్రేమ స్వరూపులుగా అవ్వాలి, భూతాలను తొలగించివేయాలి.

గీతము:- చివరికి ఆ రోజు నేటికి వచ్చింది... (ఆఖిర్ వహ్ దిన్ ఆయా ఆజ్...)

ఓంశాంతి. పిల్లలు పేదల పెన్నిధి అయిన తండ్రిని తెలుసుకున్నారు మరియు తండ్రి స్మృతిలో కూర్చుని ఉంటారు. కళ్ళతో ఎవరిని చూస్తున్నా కానీ, కర్మేంద్రియాలతో కర్మలు చేస్తున్నా కానీ - చేతులతో పని చేస్తూ ఉండండి, హృదయాన్ని ప్రియుని వైపు జోడిస్తూ ఉండండి అని అంటూ ఉంటారు. బ్రాహ్మణ కుల భూషణులకు ఈ విషయాలు తెలుసు మరియు వారితోనే తండ్రి మాట్లాడుతారు - అర్ధకల్పం మీరు తండ్రిని స్మృతి చేసారు అని. డ్రామానుసారముగా మీకు తండ్రి స్మృతి కలిగింది, సృష్టి చక్రము ఎలా తిరుగుతుందో తెలిసింది. మొత్తం ప్రపంచము విస్మృతిలో ఉంది. తండ్రి యొక్క రచన గురించి మరియు తండ్రి పతితుల నుండి పావనులుగా చేసే కర్తవ్యం గురించి లేక సర్వులకు సద్గతినిచ్చే కర్తవ్యం గురించి ఎవరికీ తెలియదు. మీకు రచయిత మరియు రచనల ఆదిమధ్యాంతాలు తెలుసు. సృష్టి చక్రము ఎలా తిరుగుతుంది, మనం 84 జన్మల చక్రములో ఎలా తిరుగుతాము అన్నది మీకు స్మృతి కలిగింది. ఎవరైతే సత్యయుగము నుండి మొదలుకొని కలియుగాంతం వరకు పాత్రను అభినయించారో, వారే ఇప్పుడు కూడా అభినయిస్తారు. సత్యయుగము నుండి మొదలుకొని కలియుగము వరకు జన్మలు తీసుకుంటూ కిందకు దిగుతూ వచ్చారు. ఇప్పుడు కలియుగాంతములో మీది ఎక్కే కళ. మీరు ఎక్కే కళలోకి వెళ్తే మీ కారణంగా సర్వులకు మేలు జరుగుతుంది అని అంటారు. కావున మీకు అంతా స్మృతి కలిగింది, దీనినే స్మృతిర్లబ్ధ, నష్టోమోహ్ అని అంటారు. ఎవరి ద్వారా స్మృతి కలిగింది? తండ్రి ద్వారా. మీ అంతట మీకు స్మృతి కలగలేదు. ఆత్మలమైన మనం పరమపిత పరమాత్మ యొక్క సంతానమని మీకు తెలుసు. ఈ శరీరాన్ని అయితే లౌకిక తండ్రి ఇచ్చారు. ఇప్పుడు పారలౌకిక తండ్రి అంటారు, ఈ పాత శరీరం యొక్క భానాన్ని విడిచిపెట్టండి, ఏ విధంగా పాము పాత కుబుసాన్ని విడిచిపెడుతుంది మరియు కొత్తది తీసుకుంటుంది. ఈ విషయం సత్యయుగానికి సంబంధించినది. మీరు కూడా సత్యయుగము నుండి మొదలుకుని శరీరాలను వదలడం మొదలుపెడతారు. ఇప్పుడు మీది అంతిమ జన్మ. తండ్రి అంటారు - ఇంకా కొద్ది సమయమే ఉంది. మీకు ఓర్పు లభించింది, మేము మళ్ళీ తండ్రి ద్వారా సుఖం యొక్క వారసత్వాన్ని పొందుతున్నాము అని మీరు సంతోషములో ఉన్నారు. సుఖం యొక్క వారసత్వమైతే తండ్రి ద్వారా లభిస్తుంది కదా. ఈ విషయం మనుష్యులెవ్వరి బుద్ధిలోకి రాదు. వారు లక్ష్మీ-నారాయణుల మందిరంలోకి వెళ్ళినప్పుడు, వీరు ఎవరు అన్నది వారి బుద్ధిలోకి రాదు. వారు భక్తి మార్గంలో చేతులు జోడించి - నీవే తల్లివి, తండ్రివి అని అంటూ ఉంటారు. శివబాబా అయితే అందరికన్నా పెద్దవారు. శివబాబా తోట యజమాని కూడా ఎందుకంటే కొత్త దైవీ పూల తోటకు అంటు కడతారు. వారు స్వయం తోట మాలి కూడా మరియు చేయి పట్టుకుని తమతో పాటు తీసుకువెళ్తారు. కావున బాబా తోట మాలిగా, తోట యజమానిగా మరియు నావికుడిగా ఎలా అవుతారు - ఇవన్నీ పిల్లలైన మీకే తెలుసు. ఇవన్నీ వారికున్న అనేక పేర్లు, వారిని లిబరేటర్ (ముక్తిదాత) అని కూడా అంటారు. స్మృతి కూడా వారినే చేయాలి. బాబా అంటారు, ఇక్కడకు వచ్చినప్పుడు శివబాబాను స్మృతి చేసి రండి. మనమైతే శివబాబాను మనవారిగా చేసుకున్నాము. బ్రహ్మ కూడా వారిని తమవారిగా చేసుకున్నారు. మరి మనం వారినే ఎందుకు స్మృతి చేయకూడదు. చిత్రములో కూడా - అందరూ శివుడినే నమ్ముతారు అన్నట్లు చూపించారు. బాబా ఆత్మలతో మాట్లాడుతారు. ఆత్మ అనకుండా జీవాత్మ అని అంటారు ఎందుకంటే ఆత్మ ఒంటరిగా ఉన్నప్పుడు మాట్లాడలేదు. శరీరము లేకుండా ఆత్మ, ఆత్మతో మాట్లాడదు. పరంధామంలో పరమాత్మ ఆత్మతో మాట్లాడుతారా? క్రైస్టును పరమాత్మ పంపించారు అని అంటారు కానీ అక్కడ పరమాత్మ మాట్లాడరు, అక్కడ సూచనలు కూడా ఉండవు. డ్రామానుసారముగా ఆత్మ తనకు తానుగా పాత్రను అభినయించేందుకు కిందకు వస్తుంది. ఆత్మలో పాత్ర నిండి ఉంది. కావున ఆత్మ కిందకు వచ్చి శరీరాన్ని ధారణ చేసి పాత్రను అభినయిస్తుంది. శరీరము

యొక్క పేరైతే అందరిదీ వేర్వేరుగా ఉంటుంది. ఆత్మ పేరు ఆత్మనే. ఆత్మలమైన మనం ఒక శరీరాన్ని వదిలి మరొకటి తీసుకుని పాత్రను అభినయిస్తాము. ఇప్పుడు మనకు స్మృతి కలిగింది, ఇంకెవ్వరి స్మృతి ఉండకూడదు ఎందుకంటే పాత ప్రపంచములో పాత పాత్రను, పాత శరీరాన్ని వదిలి కొత్త ప్రపంచములోకి వెళ్ళాలి. అక్కడ మనకు కొత్త శరీరము లభిస్తుంది. కావున ఇప్పుడు పంచ వికారాలను విడిచిపెట్టాలి అని దీని ద్వారా అర్థమవుతుంది, మరి ఇందులో ఎంత కష్టమతుంటుంది.

చూడండి, పిల్లలు రాస్తారు - కామం, క్రోధము యొక్క తుఫానులు వస్తాయి అని. అప్పుడు బాబా అంటారు, పిల్లలూ, దానం ఇస్తే గ్రహణం వదులుతుంది. ఈ సమయంలో ఆత్మకు గ్రహణం పట్టి ఉంది. మొదట మీరు 16 కళల సంపూర్ణులుగా ఉండేవారు, ఇప్పుడు ఏ కళ లేదు. ఎలాగైతే చంద్రునికి కూడా పౌర్ణమి తర్వాత మెల్లమెల్లగా కళ తగ్గిపోతూ ఉంటుంది. అంతిమంలో ఏదో కాస్త రేఖ మిగిలి ఉంటుంది. ఇప్పుడు మీది కూడా అదే అవస్థ. బాబా అంటారు, దానమిచ్చినట్లయితే గ్రహణం వదులుతుంది. ఒకవేళ వికారాలను దానమిచ్చి మళ్ళీ తిరిగి తీసుకున్నట్లయితే ఉన్నత పదవిని పొందలేరు. ఇక్కడ ఇది వికారాలకు సంబంధించిన విషయమే. ధనం యొక్క విషయం కాదు. హరిశ్చంద్రుని ఉదాహరణ... ఉంది. ధనాన్ని దానం చేసి తిరిగి తీసుకోకూడదు. వాస్తవానికి ఇది వికారాలకు సంబంధించిన విషయము. వికారాలను దానమిచ్చి తిరిగి తీసుకోకూడదు. హృదయం లోపల చూసుకుంటూ ఉండండి, నా హృదయం బాబాతో జోడించబడి ఉందా, ఎవరి ద్వారానైతే మన జన్మ-జన్మాంతరాల గ్రహణం వదిలిందో, వారితోనే ఉందా. సమయమైతే పడుతుంది, ఒక్కసారిగా ఏమీ వదిలిపోదు. కర్మభోగము ఏదైతే మిగిలి ఉందో, దానికి గుర్తు అనారోగ్యము. తుఫానులు వస్తాయి, దీనికి కారణము పూర్తి యోగము లేదు. తండ్రి అంటారు, ఇతర సాంగత్యాలను తెంచి నా ఒక్కరితోనే సాంగత్యాన్ని జోడించండి. ఇతర సత్సంగాలలో ప్రియుడి గురించి తెలియదు. ఆత్మలో 84 జన్మల అవినాశీ పాత్ర రచించబడి ఉంది అని కూడా తెలియదు. ఇంతకుముందు మన బుద్ధిలో కూడా ఉండేది కాదు, ఇక ఇతరుల బుద్ధిలో ఎలా ఉంటుంది! దేవతా వంశానికి చెందిన మనకు కూడా ఇంతకుముందు తెలియదు. ఇప్పుడు మీకు స్మృతి కలిగింది - మనం బ్రాహ్మణులము, మళ్ళీ సత్యయుగములో ప్రారబ్ధము మొదలవుతుంది, ఏ కర్మలైతే ప్రతి ఒక్కరు సత్యయుగములో చేసారో, వాటినే రిపీట్ చేస్తారు. సంస్కారాలు ఇమర్జ్ అవుతూ ఉంటాయి. ప్రేమ సాగరుడు, జ్ఞానసాగరుడు... అని బాబాను మహిమ చేస్తున్నారు, కావున మనం కూడా ప్రేమను నేర్చుకుంటున్నాము. ఎవరికైనా దుఃఖము కలిగించే పదాలు ఏవీ మన నోటి నుండి వెలువడకూడదు. ఒకవేళ ఎవరికైనా దుఃఖము ఇచ్చినట్లయితే మనలో భూతాలు ఉన్నాయి అని అర్థం చేసుకోవాలి, అప్పుడిక లక్ష్మిని వరించలేరు. తండ్రికి చెందినవారిగా అయ్యారు కనుక లక్ష్మిని వరించేందుకు యోగ్యులుగా అవ్వాలి. ఒకవేళ ఏదైనా భూతము ఉన్నట్లయితే త్రేతాలోకి వెళ్ళిపోతారు. పిల్లల్లో క్రోధం ఉండకూడదు. చాలా ప్రేమగా నడుచుకోవాలి. చూడండి, బాబాకు ఎంతమంది పిల్లలు ఉన్నారు, అయినా బాబా క్రోధం చేస్తారా. కావున మీరు కూడా చాలా ప్రేమ స్వరూపులుగా అవ్వాలి. ప్రస్తుతం ఇంకా చాలామంది పిల్లలు ప్రేమ స్వరూపులుగా అవ్వలేదు. అప్పుడప్పుడు రిపోర్టు వస్తుంది, అప్పుడు వీరిలో భూతము ఉంది అని వారు కూడా అర్థం చేసుకుంటారు, స్వయం ఎవరిలోనైతే భూతము ఉందో, వారు ఇతరులలోని భూతాలను ఏం తొలగిస్తారు. చాలా ప్రేమ స్వరూపులుగా అవ్వాలి మరియు ఇక్కడే అవ్వాలి. దేవతలు ప్రేమ స్వరూపులు కదా. చూడండి, లక్ష్మి-నారాయణుల చిత్రం ఎంతగా ఆకర్షిస్తుంది, కావున మనం కూడా ఆ విధంగా తయారవ్వాలి. మీపై పతి క్రోధం చేసినా కూడా మీరు ప్రేమగానే మాట్లాడాలి, అంతేకానీ, అతనిలో భూతముంది కనుక అది నాలోకి కూడా వచ్చేయడం కాదు. అలా కాదు. నాలో ఏ అవగుణాలైతే ఉన్నాయో, ఎలాగైనా సరే ఆ అవగుణాలను తొలగించుకోవాలి. చాలా-చాలా మధురముగా అవ్వాలి. లౌకిక తండ్రి క్రోధం చేస్తున్నారు అని ఎవరో అన్నారు, అప్పుడు నేను అన్నాను, అతను క్రోధం చేసినప్పుడు నీవు మంచి-మంచి పుష్పాలను అర్పించు. అప్పుడు వారు ఆశ్చర్యపోయి, ఇక శీతలమైపోతారు. చాలా యుక్తిగా అర్థం చేయించాలి ఎందుకంటే ఇది రావణ రాజ్యం కదా. మనం రాముని సంప్రదాయానికి చెందినవారము. స్వయమే అలా అవ్వకపోతే ఇతరులను ఏం తయారుచేస్తారు, అందుకే స్థాపనలో ఆలస్యం అవుతుంది. ఒకటేమో, ప్రేమగా నడుచుకోవాలి, రెండవది స్మృతిలో ఉండాలి, స్వదర్శన చక్రధారిగా అవ్వాలి. వ్యాపారమైతే చేయాల్సిందే, అందుకే ఉదయం వేళ చాలా మంచిది. త్వరగా పడుకోవాలి... త్వరగా లేవాలి... అని అంటారు కదా. అందుకే ఉదయముదయమే లేచి ఇక్కడకు వచ్చి కూర్చోండి, అప్పుడు 5 నిమిషాలైనా స్మృతి నిలుస్తుంది. తర్వాత మెల్లమెల్లగా అలవాటు అవ్వడంతో స్మృతి పక్కా అయిపోతుంది. అచ్ఛా, భోజనం చేసేటప్పుడు చూసుకోండి, ఎంత సమయం బాబా స్మృతిలో తిన్నాను! ఒకవేళ మొత్తం సమయమంతా స్మృతి చేసినట్లయితే అది కూడా గొప్ప సాహసమే. భోజనం చేసేటప్పుడు తండ్రిని స్మృతి చేయండి అని ఒకరికొకరు సూచన ఇచ్చుకోవాలి. ఒక్కొక్క ముద్దలోనూ స్మృతినిప్పించుకోండి. మనది సహజయోగము. ఇప్పుడు బుద్ధిలోకి జ్ఞానం వచ్చింది. పరమపిత

పరమాత్మను సర్వశక్తివంతుడు అని అంటారు, మరి వారిలో ఏం శక్తి ఉంది. బాంబులను తయారుచేసే శక్తి ఉందని కాదు. అలా కాదు, వారిని స్మృతి చేయడం ద్వారా వికర్మలు వినాశనమవుతాయి. ఈ శక్తి ఉంది కదా. చూడండి, వారు ఎంత అమాయకులు మరియు శక్తి ఎంత ఉంది. యథార్థ రీతిగా స్మృతి చేయడంలో శ్రమ ఉంది కదా. కావున శ్రమ చేయాలి. ఉదయం వేళ బాగుంటుంది. భక్తిలో కూడా ఉదయముదయమే లేస్తారు, జ్ఞానములో కూడా ఉదయం వేళ చాలా బాగుంటుంది. తండ్రి అంటారు, మిమ్మల్ని తోడుగా తీసుకువెళ్ళేందుకు నేను కల్పంలో ఒక్కసారే వస్తాను కావున చాలా సంతోషంగా వెళ్ళాలి. దుఃఖధామం నుండి బయటపడాలి. ఇటువంటి స్మృతి ఉంటే భయపడరు. ఎన్ని పరీక్షలు వచ్చినా కూడా స్మృతి పక్కాగా ఉండాలి. ఇటువంటి అవస్థను తయారుచేసుకోవాలి. ఇప్పుడు పిల్లలైన మీకు హం సో, సో హం యొక్క అర్థాన్ని కూడా అర్థం చేయించారు. నేను పరమాత్మను కాదు, కానీ నేను పరమాత్ముని సంతానమును. ఇదే హం సో చక్రం యొక్క దర్శనము. ఈ స్మృతి ద్వారానే మాలిన్యం తొలగుతుంది. మాలిన్యము తొలగించుకునే సమయం అమృతవేళనే. కావున పాస్ విత్ ఆనర్ గా అయ్యేందుకు కృష్ణపురికి యజమానులుగా తయారుచేసే తండ్రిని స్మృతి చేయాలి. అచ్ఛా.

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. వ్యాపారము మొదలైనవి చేస్తూ కూడా స్వదర్శన చక్రధారిగా అయి ఉండాలి. ఒకరికొకరు తండ్రి స్మృతినిప్పించుకోవాలి. ఎన్ని పరీక్షలు వచ్చినా కూడా స్మృతిలో తప్పకుండా ఉండాలి.

2. వికారాలను దానమిచ్చి మళ్ళీ ఎప్పుడూ తిరిగి తీసుకోకూడదు. ఎవరికీ దుఃఖాన్ని ఇవ్వకూడదు. క్రోధం చేయకూడదు. లోపల ఏ భూతాలైతే ఉన్నాయో, వాటిని తొలగించివేయాలి.

వరదానము:- యజమానత్వము యొక్క స్మృతి ద్వారా పరవశ స్థితిని సమాప్తం చేసే సదా సమర్థ భవ

ఎవరైతే సదా యజమానత్వము యొక్క స్మృతిలో స్థితులై ఉంటారో - వారి సంకల్పాలు ఆర్డర్ అనుసారముగా నడుస్తాయి. మనసు, యజమానిని పరవశం చేయలేదు. బ్రాహ్మణాత్మ ఎప్పుడూ తమ బలహీన స్వభావ-సంస్కారాలకు వశమవ్వలేదు. స్వభావము అన్న పదము ఎదురుగా వచ్చినప్పుడు స్వభావము అనగా స్వయం పట్ల మరియు సర్వుల పట్ల ఆత్మిక భావము, ఈ శ్రేష్ఠమైన అర్థములో స్థితులవ్వండి మరియు సంస్కారము అన్న పదము వచ్చినప్పుడు తమ అనాది మరియు ఆది సంస్కారాలను స్మృతిలోకి తీసుకురండి, అప్పుడు సమర్థులుగా అవుతారు. పరవశ స్థితి సమాప్తమైపోతుంది.

స్లోగన్:- వరదానాల శక్తిని జమ చేసుకున్నట్లయితే పరిస్థితి రూపీ అగ్ని కూడా నీరులా అయిపోతుంది.

మాతేశ్వరిగారి అమూల్యమైన మహావాక్యాలు

1. దురదృష్టము మరియు అదృష్టము, ఇప్పుడు ఈ రెండు పదాల యొక్క ఆధారము దేనిపై ఉంటుంది? ఇదైతే మనకు తెలుసు, అదృష్టవంతులుగా చేసేవారు పరమాత్మ మరియు దురదృష్టవంతులుగా చేసేది స్వయంగా మనుష్యులే. ఎప్పుడైతే మనుష్యులు సదా సుఖముగా ఉంటారో, అప్పుడు వారిది మంచి అదృష్టము అని అంటారు మరియు ఎప్పుడైతే మనుష్యులు స్వయాన్ని దుఃఖితులుగా భావిస్తారో, అప్పుడు స్వయాన్ని దురదృష్టవంతులుగా భావిస్తారు. దురదృష్టమైనా లేక అదృష్టమైనా పరమాత్మ ద్వారానే లభిస్తుంది అని మనము అనము, అలా కాదు. అలా భావించడమంటే గొప్ప మూర్ఖత్వము. పరమాత్మ అయితే మనల్ని అదృష్టవంతులుగా చేస్తారు కానీ అదృష్టాన్ని పాడుచేసుకోవడము లేక తయారుచేసుకోవడము, ఇదంతా కర్మలపైనే ఆధారపడి ఉంది. ఇదంతా మనుష్యుల సంస్కారాలపైనే ఆధారపడి ఉంటుంది. మళ్ళీ పాపం మరియు పుణ్యం యొక్క సంస్కారాలు ఎలా నిండితే, భాగ్యము అలా తయారవుతుంది. కానీ మనుష్యులు ఈ రహస్యాన్ని తెలుసుకోని కారణంగా పరమాత్మపై దోషము మోపుతారు. ఇప్పుడు చూడండి, మనుష్యులు స్వయాన్ని సుఖముగా ఉంచుకునేందుకు మాయా విధానాలను ఎన్ని కనుగొంటారు, మళ్ళీ అదే మాయతో కొందరు స్వయాన్ని సుఖంగా ఉన్నామని భావిస్తారు, మరికొందరు అదే

మాయను సన్యసించి మాయను విడిచిపెట్టడముతో స్వయాన్ని సుఖముగా ఉన్నామని భావిస్తారు, అనగా చాలా రకాల ప్రయత్నాలు చేస్తారు కానీ ఇన్ని విధాలుగా ప్రయత్నించినా రిజల్టు దుఃఖము వైపే వెళ్తుంది. ఎప్పుడైతే సృష్టిపై భారీ దుఃఖము ఏర్పడుతుందో, అప్పుడు ఆ సమయంలో స్వయం పరమాత్మ వచ్చి గుప్త రూపంలో తమ ఈశ్వరీయ యోగ శక్తితో దైవీ సృష్టిని స్థాపన చేయించి మనుష్యాత్మలందరినీ అదృష్టవంతులుగా చేస్తారు.

2. ఓం శాంతి అని అన్నప్పుడు, దాని యథార్థ అర్థము - నేను ఆత్మను సాలిగ్రామాన్ని, నేను ఆ జ్యోతి స్వరూపుడైన పరమాత్ముని సంతానాన్ని. మనం కూడా తండ్రి అయిన ఆ జ్యోతిర్బిందు పరమాత్మ వంటి ఆకారము కలిగి ఉంటాము. ఇకపోతే, మనము సాలిగ్రామాలైన పిల్లలము, మనము మన జ్యోతి స్వరూపుడైన పరమాత్మతో యోగముంచుకోవాలి మరియు లైట్-మైట్ యొక్క వారసత్వాన్ని తీసుకోవాలి. ఆ నిరాకార పరమాత్మను శ్వాస-శ్వాసలో స్మృతి చేయాలి, దీనినే నిరంతర జపము అని అంటారు. నిరంతర జపము అనగా ఏదో ఒక మంత్రాన్ని జపించడము కాకుండా సహజంగానే ఆ పరమాత్మ స్మృతిలో ఉండడము, దీనినే పూర్ణ యోగము అని అంటారు. యోగం అనగా అర్థము - ఒక్క యోగేశ్వరుడైన పరమాత్మ స్మృతిలో ఉండడము. కావున ఏ ఆత్మలైతే ఆ పరమాత్మ స్మృతిలో ఉంటారో, వారిని యోగులు లేక యోగినీలు అని అంటారు. ఎప్పుడైతే ఆ యోగములో అనగా స్మృతిలో నిరంతరము ఉంటారో, అప్పుడే వికర్మలు మరియు పాపాల భారము నశిస్తుంది మరియు ఆత్మలు పవిత్రంగా అయి భవిష్య జన్మలో దైవీ ప్రారబ్ధాన్ని పొందుతారు. ఇప్పుడు ఈ జ్ఞానము కావాలి, అప్పుడే యోగము పూర్తిగా జోడింపబడగలదు కావున స్వయాన్ని ఆత్మగా భావిస్తూ పరమాత్మ స్మృతిలో ఉండాలి, ఇది సత్యమైన జ్ఞానము. అచ్చా! ఓం శాంతి.